నోటీసులు అందుకొని కుప్పకూలి వృద్ధుడు మృతి

పళనిశెట్టియార్ నివాసం ఉండే ఇల్లు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ ఇరువారానికి చెందిన పళని శెట్టియార్ (68) గత 8 సంవత్సరాలుగా సామాజిక ఫించన్ పొందుతున్నాడు. భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎలాంటి పని చేయకుండా ఇంట్లో ఉంటున్నాడు. వీరికి చిన్నాపాటి పెంకుటిల్లు మినహా ఎలాంటి ఆస్తులు లేవు. ప్రభుత్వం ఇచ్చే ఫించన్ డబ్బులతోనే జీవనం గడుపుతున్నారు. ఆదివారం ఫింఛన్ పొందేందుకు అర్హత నిరూపించుకోవాలంటూ వాలంటీర్ పళని శెట్టియార్ ఇంటి వద్దకు వచ్చి నోటీసు ఇచ్చింది. ఇక పై ఫించన్ రాదేమోనన్న ఆందోళనతో నోటీసులు అందుకున్న పళనిశెట్టియార్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. వెనువెంటనే చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. తమ కుటుంబానికి ఆసరాగా ఉన్న ఫింఛన్ రాదేమో అన్న ఆందోళనతోనే పళని శెట్టియార్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లేదు లేదంటూనే... ఏడి 'పింఛన్'

జిల్లాలో 9,198మందికి నోటీసులు
'వెరిఫికేషన్' పేరుతో కలకలం

తిరుపతి మారుతీనగర్‌కు చెందిన సత్తార్ సాహెబ్

- తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన సత్తార్ సాహెబ్ (70) పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయన కుమారుడు కాంట్రాక్టు ఉద్యోగి. కుమారునికి నెలకు 12వేల జీతం వస్తోంది. అయితే నాలుగు నెలలుగా సత్తార్ సాహెబ్‌కు వస్తున్న పింఛన్‌ను నిలిపేశారు. పింఛన్ పునరుద్ధరించాలని అర్జీ పెట్టుకున్నా కనికరించలేదు. పింఛన్ రావాలంటే కుమారునితో కలిసి ఉండరాదని చెబుతుండటం గమనార్హం. పింఛన్ రాక సత్తార్‌సాహెబ్ సుగర్, బీపీకి సంబంధించిన మందులను కొనుక్కోడానికి ఇబ్బందులు పడుతున్నాడు.
- సప్తగిరినగర్‌కు చెందిన జయంతి వికలాంగురాలు. ఆమె నివసిస్తున్న ఇంటికి మూడు మీటర్లు ఉన్నాయన్న సాకు చూపించి పింఛన్ తొలగించారు. కమిషనర్ అనుపమ అంజలి దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్ ఆఫీసు నుంచి అన్ని మీటర్లు లేవని లెటర్ తీసుకొస్తేనే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.
- సప్తగిరినగర్‌కు చెందిన దేవిసింగ్‌కు 300 గజాల స్థలం ఉందని, ఎంఆర్‌పల్లిలో రెండు ఇళ్లు ఉన్నాయని పింఛన్ రద్దు చేశారు. ఇళ్లు లేవని చెప్పినా వినే దిక్కులేదు. కమిషనర్ హామీ ఇవ్వడం తప్ప పింఛన్ పునరుద్ధరించకపోవడంతో లబోదిబోమంటున్నారు.
- కొర్లగుంటకు చెందిన రాజు 300 యూనిట్ల విద్యుత్ వాడారని పింఛన్ రద్దు చేశారు. వార్డు సిబ్బంది ఇంటికి వచ్చి అతనికి నోటీసు ఇచ్చి బలవంతంగా సంతకం తీసుకుని వెళ్లిపోయారు. కమిషనర్ పరిశీలిస్తామని చెప్పారే తప్ప పునరుద్ధరించలేదు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

'వచ్చే నెల నుంచి 250 రూపాయలు అదనంగా కలిపి 2,750 రూపాయలు చేతికి వస్తుందని సంబరపడిన పింఛన్‌దారుల్లో కొంతమందికి నోటికాడ కూడు తీసేసినట్లయ్యింది.. కరెంట్ ఎక్కువ వాడారని, మీ పేరుతో ఎక్కువ ఇళ్లు ఉన్నాయన్న సాకుతో జిల్లావ్యాప్తంగా 9,198 మందికి నోటీసులను ప్రభుత్వం అందజేసింది.. దీంతో వారు కరెంట్ ఆఫీసుల చుట్టూ, సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ తమ పింఛన్ తొలగించొద్దంటూ వేడుకొంటున్నారు.. సోమవారం 'స్పందన'కు వచ్చిన వారిలో ఎక్కువమంది నోటీసులు అందుకున్న పింఛన్‌దారులే ఉండటం గమనార్హం. అయితే ప్రభుత్వం మాత్రం పింఛన్ తొలగించలేదని, కేవలం వెరిఫికేషన్ మాత్రమే జరుగుతోందని అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు.

తిరుపతి జిల్లావ్యాప్తంగా 2 లక్షల 60వేల 814మందికి వివిధ రకాల పింఛన్లను ప్రతినెలా ఒకటో తేదీ ప్రభుత్వం అందజేస్తోంది. అయితే 9,198 పెన్షన్ నోటీసులు జిల్లావ్యాప్తంగా పింఛన్‌దారులకు అందాయి. అయితే అధికారులు మాత్రం జిల్లాలో ఏ ఒక్కరి పింఛన్ తొలగించలేదని,కంప్యూటర్ బేస్డ్ డేటా నుంచి జనరేట్ అయిన నోటీసులు మాత్రమే ఇచ్చామని, వెరిఫికేషన్ క్షేత్రస్థాయిలో చేపట్టి ఈనెల 30లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమపథకాలు అనర్హులకు అందరాదన్నదే తమ ఉద్దేశ్యమని చెబుతున్నారు.

నోటీసుల్లో పేర్కొన్న అంశాలివే..

6- స్టెప్ వాలిడేషన్ లో జనరేట్ అయిన నోటీసులపై పట్టణాలలో 1000 చదరపు అడుగులు ప్లింత్ ఏరియా పైన ఉండరాదని, విద్యుత్తు వినియోగపు వరుసగా ఆరు నెలల్లో సరాసరి యూనిట్లు 300 నిబంధనల మేరకు దాటరాదని, ఒకే వ్యక్తి పై పలు మీటర్లు ఉండరాదని, ఒక కుటుంబంలో 10 ఏకరాల డ్రై లాండ్, లేదా 3 ఎకరాల తడి భూమి లేదా తడి, డ్రై భూమి కలిపి మొత్తం 10 ఎకరాలకు మించరాదని, కుటుంబం మొత్తం గ్రామీణ ప్రాంతంలో ఆదాయం పదివేలకు మించరాదని, పట్టణాలలో అయితే 12000 కి మించరాదనీ, ఫోర్ వీలర్ సొంత వాహనం ఉండరాదని, ఇన్కమ్ టాక్స్ తదితర నిబంధనల మేరకు నోటీసులు అందాయి. నోటీసు పొందిన వారి ఇంటికి వెళ్ళి కలిసి వివరించి అర్హులైనచో వారికి తొలగింపు ఉండదని, అనర్హులైనచో కారణం తెలిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలో వివిధ రకాలుగా పింఛన్లు పొందుతున్న లక్షా 90 వేల మందికి 6 స్టెప్ వ్యాలిడేశన్ లో కంప్యూటర్ జనరేటెడ్ నోటీసులు అందజేశారు. 2 లక్షల 90వేల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి జిల్లాలో 8,331 మందికి కొత్త పింఛన్లు ఇవ్వనున్నట్లు అధికారిక లెక్కలు.

శ్రీకాళహస్తిలో వినతిపత్రం ఇస్తున్న నేతలు

దుర్మార్గ చర్య : సిపిఎం

తిరుపతి జిల్లాలో వేలాదిమంది వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వద్ధాప్య పింఛన్లను అకారణంగా రద్దు చేస్తూ అధికారులు నోటీసు ఇవ్వడం దుర్మార్గపు చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. రద్దు చేసిన సామాజిక పింఛన్లను పునరుద్ధరించాలని జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. అకారణంగా పెన్షన్ రద్దు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని , బాధితులకు తిరిగి పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు.

అర్హులకు న్యాయం చేస్తాం : కమిషనర్

పింఛన్ ఎవరికీ తొలగించడం లేదు. 300 యూనిట్లు విద్యుత్ వాడినిక వారికి, నాలుగు చక్రాల వాహనం ఉంటే, పది ఎకరాల పొలం ఉంటే వారిని మాత్రం గుర్తించి పింఛన్లు రద్దు చేస్తాం. అర్హులకు న్యాయం చేస్తాం. ఎవరూ అధైర్యపడొద్దు... న్యాయం చేస్తాం. అనర్హుల కథ తేల్చేందుకే నోటీసులను ఇచ్చాం.

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి

రద్దు చేయొద్దని సిపిఎం ధర్నాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ /గూడూరు/ శ్రీకాళహస్తి

తిరుపతి నగరంలో వికలాంగులకు, వద్దులకు, వితంతువులకి పింఛన్ల రద్దు కోసం నోటీసులు జారీ చేసినందుకు వ్యతిరేకంగా, రద్దు చేసిన పింఛన్లు కొనసాగించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టీ. సుబ్రమణ్యం మాట్లాడుతూ ఏళ్ల తరబడి తీసుకుంటున్న పింఛన్దారులైన 1274 మందికి పింఛన్ రద్దు చేయడం కోసం నోటీసులు జారీ చేశారని తెలిపారు. విద్యుత్ మీటర్లు మూడు ఉన్నాయని, ఎక్కువ ఇల్లు ఉన్నాయని, 300పైబడి యూనిట్ల కరెంటు వినియోగించుచున్నారని తప్పుడు నోటీసులు సష్టించి కుట్రపూరితంగా పింఛన్లు రద్దు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెరగబోయే పింఛన్ల భారాన్ని తగ్గించడం కోసం పింఛన్ల రద్దుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అనంతరం 'స్పందన' కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కమిషనర్ స్పందిస్తూ పింఛన్లు తొలగించకుండా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే వేణు, ఆర్ లక్ష్మి, పి బుజ్జి, పి ముని రాజా, మల్లికార్జున రావు, నరేంద్ర, తంజావూరు మురళి, గంగులప్పా, ప్రేమ్ కుమార్, జయంతి, సరోజమ్మ పాల్గొన్నారు.

గూడూరు చెన్నూరు గ్రామ మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఒక్క చెన్నూరులో మూడు సచివాలయాల పరిధిలో తప్పుల తడకతో దాదాపు 170 మందిని అనర్హులుగా ప్రకటించి తొలగించడం తగదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు గ్రామ శాఖ కార్యదర్శి గుర్రం రమణయ్య, గూడూరు పట్టణ కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, నారి వెంకటప్పయ్య, గంట వెంకటేశ్వర్లు ఎస్.కే. ఆరిఫ్ ఎన్. నరసింహులు తదితరులు పాల్గొన్నారు. గూడూరు పట్టణ పరిధిలో 600 మందికి నోటీసులు జారీ చేశారని జనసేన పట్టణ కమిటీ అధ్యక్షులు ఇంద్రవర్ధన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, కార్యదర్శులు వంశీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు రద్దు చేస్తే తీవ్ర పరిణామాలు

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సామాజిక పెన్షన్లు రేషన్ కార్డులు, రకరకాల నిబంధనల పేరుతో రద్దు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవనీ, పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పెన్షన్ల తొలగింపుపై సోమవారం సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. పుల్లయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 1118 పెన్షన్లు తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, కుప్పమ్మ, అన్వర్ బాషా, రాజా, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 27 నుండి 29 వరకు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ధనంజయ వై.చంద్రచూడ్ తిరుపతి జిల్లాలో పర్యటించ నున్నారని కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 27న ఉదయం 9:45 గంటలకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.35 గంటలకు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌కు చేరుకుంటారని, అక్కడ నుండి రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని రాత్రికి అక్కడే బస చేసి 28 న తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజు గురువారం సాయంత్రం 5.40 కు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి విజయవాడకు వెళ్ళనున్నారని తెలిపారు.

టోకెన్ ఉన్న భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు టికెట్లు, టోకెన్లు పొంది తిరుమలకు రావాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ విజ్ఞప్తి చేశారు. తిరుమలలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఈవో మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనం జనవరి 2 నుండి 11వ తేదీ వరకు 10 రోజుల పాటు ఉంటుందని ఈవో చెప్పారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా రూ.300 ఎస్ఇడి టికెట్లు రూ.2 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. తిరుపతిలో అలిపిరి వద్దగల భూదేవి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ఎదురుగా గల విష్ణునివాసం, రైల్వేస్టేషన్ వెనుక గల 2, 3 సత్రాలు, ఆర్టిసి బస్టాండు ఎదురుగా గల శ్రీనివాసం కాంప్లెక్స్, ఇందిరా మైదానం, జీవకోన జిల్లా పరిషత్ హైస్కూల్, భైరాగిపట్టెడలోని రామానాయుడు మున్సిపల్ హైస్కూల్, ఎంఆర్ పల్లి జడ్‌పి హైస్కూల్, రామచంద్ర పుష్కరిణి వద్ద ఏర్పాటు చేస్తున్న కౌంటర్లలో జనవరి ఒకటో తేదీన సర్వదర్శనం టోకెన్ల జారీ ప్రారంభిస్తామన్నారు. 10 రోజుల కోటా పూర్తయ్యేంత వరకు నిరంతరాయంగా టోకెన్లు ఇచ్చేం దుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులు తిరుమలలోని కష్ణతేజ విశ్రాంతి గహం వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు. భక్తులు టిటిడి వెబ్‌సైట్, ఎస్వీబీసీ, ఇతర మాధ్యమాల ద్వారా టికెట్ల లభ్యతను ముందే తెలుసుకుని తమ తిరుమల ప్రయాణాన్ని ఖరారు చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. భక్తులు ముందుగానే వచ్చి క్యూలైన్లలో నిరీక్షించకుండా టోకెన్‌పై తమకు కేటాయించిన ప్రాంతానికి నిర్దేశించిన సమయానికి మాత్రమే రావాలని కోరారు. తిరుమలలో వసతి సౌకర్యం తక్కువగా ఉన్నందున దర్శన టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే ముందు వచ్చిన వారికే ముందు అన్న ప్రాతిపదికపై వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈవో వెంట అదనపు ఈవో(ఎఫ్ఏసి) వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఉన్నారు.

వాతావరణ మార్పులపై విస్తృత పరిశోధనలు సాగాలి

ప్రజాశక్తి-క్యాంపస్

మారుతున్న వాతావరణ పరిస్థితులు, వాటి ద్వారా కలిగే మంచి చెడులపై విస్తృత పరిశోధనలు సాగాలని యూఎస్ఏకి చెందిన వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ తల్లాప్రగడ విజయ్ పేర్కొన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగంలో 'వాతావరణ మార్పులపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వాతావరణ కాలుష్యం, పారిశ్రామిక అభివృద్ధి, ఇతర మానవ తప్పిదాల కారణంగా వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని చెప్పారు. దీనివల్ల మానవ, ఇతర జీవజాతుల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. గాలి, నీరు, మొత్తంగా వాతావరణం వంటి సకల రూపాల్లో కాలుష్యం పెరిగిందన్నారు. పెరిగిన కాలుష్యాన్ని నివారించటం, కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాలని గుర్తించడం, వాటికి సంబంధించిన నివారణ ఉపాయాలను సమాజానికి సూచించడం వాతావరణ శాస్త్రవేత్తల బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్పి విజయలక్ష్మి, డీన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్లు దేవప్రసాద్ రాజు, రత్నాకరం, రాజగోపాల్ రెడ్డి, రుద్రమదేవి, అధ్యాపకులు, పీజీ, పిహెచ్ .డీ విద్యార్థులు పాల్గొన్నారు.

'రాధా రంగా' మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాధా రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ అధ్వర్యంలో తిరుపతి అనంత వీధి కూడలి నందుగల గర్ల్స్ హై స్కూల్ ముందు వంగవీటి మోహన రంగాకు ఘనంగా నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కాపు నాయకులు ఊక విజయకుమార్ విచ్చేసారు. ఈ సందర్భంగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేద బడుగు వర్గాలకు చెందిన వాడని, తిరుపతి లో వంగవీటి మోహన రంగా వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిపార్ట్మెంట్ మాజీ నాయకులూ అంజి బాబు, చిన్న బాబు, బులెట్ రమణ, మహేష్ యాదవ్, జనసేన కీర్తన, ఆకేపాటి సుభాషిణి పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ఐక్విస్ట్

ప్రజాశక్తి -తిరుమల

విద్యార్థుల జ్ఞానాన్ని అభివద్ధి చేయడానికి క్రియేటివ్ మాస్ట్రో క్యాంపస్ లెవెల్‌లో 'ఐక్విస్ట్' కార్యక్రమం సోమవారం జరిగింది. విద్యార్థులు చక్కటి వేషధారణలో వచ్చి వారి యొక్క జ్ఞానాన్ని అభివద్ధి చేసుకోవడానికి పిల్లలతోపాటు తల్లిదండ్రుల కషి ఉపాధ్యాయుల కషి విద్యార్థులకు తమదైన శైలిలో ధైర్యాన్ని ఇచ్చింది. తద్వారా విద్యార్థులు క్యాంపస్ లెవెల్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ , ఆర్ ఐ డాక్టర్ మోహన్ బాబు , పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ,ఫెసిలిటేటర్ సుధా నాయర్ , డీన్ రాజశేఖర్, ఉపాధ్యాయులందరూ కలసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దేశానికి సిరిసంపదలు పిల్లలే

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'బాలోత్సవ' విజయోత్సవ సభలో వక్తలు

'ఈ దేశానికి బాలబాలికలే సిరిసంపదలు' అని వక్తలు కొనియాడారు. ఇలాంటి బాలోత్సవం నిర్వహించుకుని సమాజంలో కరువవుతున్న విలువలను పెంపొందించుకోవాలన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఏ విధంగా జరిగాయో రెండు రోజుల పాటు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో బాలోత్సవాలు జరిగాయన్నారు. సమాజం పట్ల అంకితభావం ఉన్న వారు కలిసి స్వతంత్రంగా బాలోత్సవాన్ని విజయవంతం చేసినందుకు తిరుపతి బాలోత్సవ అధ్యక్ష కార్యదర్శులు నడ్డి నారాయణ, రెడ్డెప్పలు తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ హైస్కూల్లో సోమవారం సాయంత్రం విజయోత్సవ సభ జరిగింది. భవిష్యత్‌లో పిల్లల పండుగను అద్భుతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం కమిటీ కోశాధికారి గురునాధం బాలోత్సవ కార్యక్రమానికి

సహకరించిన దాతల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో బాలోత్సవ కమిటీ నిర్వాహకులు ఎం.నాగార్జున, దామోదరం సాకం నాగరాజు, బండి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, శ్రీరాములు, మల్లేశ్వరరావు, మునిరామయ్య పాల్గొన్నారు.

సంక్రాంతికి ముందే 'సై'

- విచ్చలవిడిగా కోడి'పందేలు'
- చేతులు మారనున్న రూ.కోట్లు
- పందెం పుంజులకు భలే గిరాకీ
- నామమాత్రంగా పోలీస్ చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సంక్రాంతి కోడి పందేలకు సైరన్ మోగింది. చట్టవ్యతిరేక కార్యక్రమమైనా విచ్చలవిడిగా బహిరంగంగానే పలు చోట్ల కోడి పందేలను నిర్వహిస్తున్నారు. పురాతన సంప్రదాయం పేరిట సాగుతున్న ఈ కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఎప్పటిలాగే ఈ ఏడాదీ కోడి పందేలకు తూర్పు మండలాల్లో పోరు బరులు సిద్ధమై పోయాయి. డబ్బే పరమావధిగా ఈ విషసంస్కృతికి కొందరు ఆజ్యం పోస్తుండటంతో తూర్పు మండలాల్లో కోడి పందేలు మూడు పువ్వులు..ఆరు కాయలు అన్న చందంగా జరుగుతుండటం గమనార్హం. అయితే కోడి పందేలు చట్ట వ్యతిరేక కార్యక్రమమంటూ స్వయానా సుప్రీం కోర్టే చెబుతున్నా అడ్డుకట్ట వేయడంలో పోలీస్ యంత్రాంగం విఫలమవుతూనే ఉంది.

- **పందెం పుంజులకు భలే గిరాకీ**

తూర్పు మండలాల్లోని పలు ప్రాంతాల్లో భారీ ఏర్పాట్ల నడుమ పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పందేల కోసం ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచుతారు. వాటి ఆహార నియమాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని యజమానులు పందెం కోళ్లను సిద్ధం చేస్తారు. సిద్ధం చేసిన కోళ్లలో రంగులను బట్టి వాటి ధరలు నిర్ణయించబడుతాయి. ఒక్కో కోడి ధర రూ.5 వేల నుంచి రూ.10 వేలకు వరకు ఉంటుంది. మేలు రకం కోడి అయితే ధర గరిష్టంగా రూ.20వేల నుంచి రూ.40వేల వరకు ఉంటుంది. ఈక రంగును బట్టి పందెం కోళ్లను రకరకాల పేర్లతో పిలుస్తారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కాకి, డేగ, నెమలి, పర్ల, ఎరుపుగౌడు, తెలుపుగౌడు రకాల కోళ్ల పేర్లు నానుడిలో ఉన్నాయి. సూర్యుని వెలుగును బట్టి పందెం రాయుళ్ల రంగంలోకి దిగుతుంటారు. సాయంత్రం పూట కాకి, డేగ రకాలను రంగంలోకి దింపితే విజయం వరిస్తుందని, పగటిపూట నెమలి, పర్ల రకాలను దించితే గెలుపు మనదే అని పందెం రాయుళ్లు విశ్వసిస్తుంటారు.

- **పందెం రకాలు:**

సాధారణంగా కోడి పందేలను నాలుగు రకాలుగా నిర్వహిస్తుంటారు. ఎత్తుడు, దించుడు పందెం, చూపుడు పందెం, ముసుగు పందెం, డింకీ పందేలు ప్రచారంలో ఉన్నాయి. అయితే శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఎత్తుడు, దించుడు, చూపుడు

పందాలు ఎక్కువగా ఆచరణలో ఉన్నాయి. కోడి పందేలా నిర్వాహకులు, తీతలు(కత్తికట్టేవాడు)కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. తీతల సెంటిమెంట్లు కూడా పందేలలో పనిచేస్తూ ఉంటుంది. దీంతో పెద్ద ఎత్తున నిర్వహించే కోడి పందేలలో బెట్ వల్ల వచ్చే మొత్తంలో కొంత తీతకు ఇవ్వాల్సి ఉంటుంది. చిన్న పందేలలో అయితే ఓడిపోయిన కోడి నుంచి గెలిచిన కోడి తీతకు మాంసాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పందెంను త్వరగా ముగించాలనే వక్ర ఆలోచనతో కొందరు తీతలు కత్తికి విషరసాయనాలు పూస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

- **చేతులు మారుతున్న కోట్ల రూపాయలు**

ఎప్పటిలాగే ఈ ఏడాదీ సంక్రాంతి సంబరాల్లో భారీగా కోడి పందేలు జరగనున్నట్లు సమాచారం. డిసెంబర్ నెల నుంచే కోడి పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్ద పందేల వద్ద రూ.లక్షల్లో, చిన్నపందేలా వద్ద రూ.వేలల్లో బెట్టింగులు జరగుతాయని విశ్వసనీయ సమాచారం. శ్రీకాళహస్తి, సత్యవేడు పరిధిలో చూస్తే బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పాలవేడు గ్రామంలో పెద్ద ఎత్తున కోడి పందేలు జరుగుతాయని సమాచారం. అదేవిధంగా నెలవాయి, కంచనపుత్తూరులో కూడా భారీ ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తారని వినికిడి. అదేవిధంగా చిత్తూరు-నెల్లూరు సరిహద్దులోని వరదయ్యపాళెం మండలం, సూళ్లూరుపేట మండలాల మధ్య ఉన్న ఓ ఫారెస్టు భూమి ప్రాంతంలో ఉగ్గుమూడి, మంగళం పాడు గ్రామాల నడుమ భారీ ఏర్పాట్ల నడుమ పెద్ద ఎత్తున కోడి పందేలు జరుగుతాయని సమాచారం. ఇక్కడ పందేలు రూ.లక్షల్లో ఉంటాయని, పోలీసులు సైతం పందేల్లో పాల్గొంటారనే విమర్శలూ ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం, వాంపల్లి, ఇనగలూరు, ఈంద్రపల్లి, కలవగుంట, ఏర్పేడు మండలంలోని చింతలపాళెం, బండవానిపల్లి, పాపానాయుడుపేట, తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు, కంచనపల్లి, శ్రీకృష్ణాపురం, కారాకొల్లు, కేవీబీపురం మండలంలోని కొండల్లో ఆదవరం, కళత్తూరు, అంజూరు, బంగారమ్మ కండ్రిగ గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు జరుగుతాయని తెలిసింది. ప్రతి సంక్రాంతికి కోడి పందేలా నిర్వహణ సాగుతున్నా, నివారించడంతో పోలీస్ యంత్రాంగం విఫలమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. కొందరు యువకులు ఈజీ మనీకి అలవాటు పడి కోడి పందేల్లో డబ్బులు పెట్టి నష్టపోతున్నారు. అలా కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సంక్రాంతికి ముందే పందేలలో పాల్గొంటూ పట్టుబడ్డ వారిని ముందస్తుగా బైండోవర్ చేసుకుంటే పరిస్థితిలో కాస్తయినా మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- **కఠిన చర్యలు తప్పవు: విశ్వనాథ్, డీఎస్పీ, శ్రీకాళహస్తి**

కోడి పందేలు ఆడటం జూదంతో సమానం. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. పండగే కదా అని కోడి పందేలు నిర్వహిస్తే తగిన పర్యావసానాలు అనుభవించాల్సిందే. ఎక్కడ కోడి పందేలు జరిగినా ఉపేక్షించేదిలేదు. దాడులు చేసి కేసులు పెడతాం. కోడి పందేలను అడ్డుకోవాలని అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశాం.

రాష్ట్రస్థాయి దేహ దారుఢ్య పోటీలలో..

కొల్లడం యువకుడు సునీల్ ప్రతిభ



ప్రజాశక్తి -సత్యవేడు: బాడీ బిల్డింగ్ పోటీలలో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పెద్దఈటిపాకం పరిధిలోని కొల్లడం గ్రామానికి చెందిన సెల్వి రమణ కుమారుడు సునీల్ 5వ స్థానంలో నిలిచారు. తమిళనాడు పట్టాభిరామ్ పట్టణంలో డిసెంబర్ 25వ తేదీ జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో యువకుడు సునీల్ 5వ స్థానంలో నిలిచి తన సత్తాను చాటారు. ఈ సందర్భంగా యువకుడు సునీల్‌కు ప్రశంసా పత్రం, మెమొంటోను బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు అందించారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్‌సిపి జిల్లా కార్మిక సంఘాల అధ్యక్షులు బీరేంద్ర వర్మ, సింగల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, సత్యవేడు గ్రామ సర్పంచ్ మంజుల బెల్ట్ రమేష్, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలాజీ రెడ్డి తదితరులు బాడీ బిల్డర్ యువకుడు సునీల్‌ను అభినందించారు.

కార్మికులకు అండగా ఉంటాం : బాలసుబ్రమణ్యం



ప్రజాశక్తి -చిల్లకూరు మండల కేంద్రమైన చిల్లకూరు దర్గా బడినందు సిఐటియు మండల కమిటీ సమావేశం జిల్లా సిఐటియు నాయకులు ఇందిరావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు. అధ్యక్షులు ఇంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు ఉన్నాయని సిఐటియు ద్వారా విస్తరించుకోవాలని అంగనవాడి కార్యకర్తలకు గుర్తు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో కార్మికుల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని కార్మికులందరూ ఏకతాటిపై నిలబడి మనమే పరిష్కరించుకోవాలన్న అవసరం ఎంతైనా ఉందన్నారు. సమస్యలను మండల కమిటీ ద్వారానే పరిష్కరించుకోవాలని మండల నూతన కమిటీ అవసరమని అన్నారు. తరువాత మండల నూతన కమిటీ ఎన్నిక మండల అధ్యక్షులుగా ఎస్.ముత్యాలయ్య, కార్యదర్శిగా ఇందిరా, కోశాధికారిగా సబిర బేగం, కమిటీ సభ్యులుగా యామిని, ప్రజాపులను ఎన్నుకున్నారు. ఎస్ ముత్యాలయ్య సమావేశాన్ని ముగించారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి నేతల పరామర్శ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని పార్టీలకు అతీతంగా నేతలు పరామర్శించారు. గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేత గాలి భానుప్రకాష్ చెవిరెడ్డి ఇంటికి సోమవారం చేరుకుని పరామర్శించారు. చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆపై చెవిరెడ్డి తల్లి మునిరత్నమ్మ, ఇతర కుటుంబ సభ్యులు అందరినీ ఓదార్చారు. అంతకు ముందు మాజీ ఎంపీ, మాజీ టీటీడీ ఛైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాసులు ఎమ్మెల్యే చెవిరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, తమ్ముడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డిలను ఓదార్చారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎస్వీయూ విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ విభాగం డైరెక్టర్ ఆచార్య బీవీ. మురళీధర్ పర్యవేక్షణలో విద్యార్థినులు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరగబోయే సౌత్‌జోన్ పోటీలకు పూర్తిస్థాయిలో అభ్యసన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆచార్య బీవీ. మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశ్రమ చేయడం ద్వారా సౌత్ జోన్ పోటీలలో ఉన్నతంగా రాణించగలరన్నారు. గత పది రోజులుగా విద్యార్థులు నిరంతరం ఉదయం సాయంత్రం రెండు గంటల పాటు పరిశ్రమిస్తున్నారన్నారు. ఈ విధంగా ప్రాక్టీస్ చేయడం ద్వారా జాతీయస్థాయిలో కూడా ఎస్వీయూ విద్యార్థినిలు మెరుగ్గా రాణించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య వెంకటరమణ, ట్రైనర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: కన్న కొడుకును పోగొట్టుకున్న విషాదంలో ఉన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సోమవారం నాడు పలువురు నేతలు పరామర్శించారు. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పారుమాంచాల గ్రామంలోని ఆయన నివాసంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఓవి రమణ, సిపిఎం



జిల్లా నేత కందారపు మురళి, సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మి తదితరులు సోమవారం మధ్యాహ్నం ఆయన్ని పరామర్శించారు. కన్న కొడుకును కోల్పోయి విషాదంలో ఉన్న ధర్మారెడ్డికి మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. తాను తిరిగి స్వామివారి సేవలో ఉంటానని జనవరి ఒకటో తేదీ రాత్రి నుంచి విధులకు హాజరవుతానని ధర్మారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి చిత్రపటానికి ఓవి రమణ, కందారపు మురళి నివాళులు అర్పించారు.

ఈఓ ధర్మారెడ్డికి ఫోన్లో సిపిఎం మధు పరామర్శ

కుమారుని కోల్పోయిన టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు పరామర్శించారు. సోమవారం నాటి మధ్యాహ్నం పెనుమల్లి మధు ఈఓ ధర్మారెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు.

పింఛనుదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు

ప్రజాశక్తి- పిచ్చాటూరు: పింఛనుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ మధుసూదన్ రావు పేర్కొన్నారు సోమవారం పిచ్చాటూరు తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలతో కొందరి పింఛనుదారులు పేర్లు పరిశీలించాలని నోటీసులు వచ్చాయని ఆ నోటీసులు అనుసరించి పరిశీలిస్తున్నారని చెప్పారు. మండలంలో కోవిడ్‌ను నియంత్రించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను పోలీసులు, మండలాధికారులతో చర్చించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు పురపాలక సంఘము

టెండరు నోటీసు నెం. 14/ఇ1/2022-23 తేది: 26-02-2022

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు నెం. 14/ఇ1/2022-23

పుత్తూరు పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 4 పనులకు 14వ ఆర్థిక సంఘపు నిధుల నుండి ఒక్క పనికి, మొత్తం 5 పనులకు గాను (నిట్ నెం.69/2022-23 & 77/2022-23 టు 80/2022-23) రిజిష్టర్డు కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమిషనరు
పుత్తూరు పురపాలక సంఘం

ప్రజలకు తక్షణమే పరిష్కారం:ఎమ్మెల్యే కిలివేటి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడపగడప మన ప్రభుత్వం సోమవారం నెలబల్లి సచివాలయం పరిధిలోని నెలబల్లి నెల్లూరుపల్లి మొదలగు గ్రామాలలో సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలబలి గిరిజన కాలనీ హరిజనవాడ నెల్లూరుపల్లి గ్రామంలో పర్యటించి ఆ గ్రామాలలోని సమస్యలను తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పథకాలపై గడపగడపకు కరపత్రాలు పంపిణీ చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, జెడ్పిటిసి సభ్యులు రమేష్, తహశీల్దార్ గోపిరెడ్డి, ఎంపీడీవో సింగయ్య, ఎంఈఓ మస్తానయ్య ఏపీఎం పద్మావతి, సీఐ సోమయ్య, ఎస్ఐ తిరుమల రావు దొరవారిసత్రం మండల వైసీపీ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, సర్పంచులు గోపిరెడ్డి, రజిని, వైసిపి మండల నాయకులు మునిస్వామి నాయుడు, సురేష్ రెడ్డి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఏర్పేడు: కురిసిన మాండూస్ తుపాన్ కారణంగా ఏర్పేడు మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుపాన్ కారణంగా చింతలపాలెం గిరిజన కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

బిన్‌కండ్రిగ: మాండూస్ తుపాన్ కారణంగా నష్ట పోయిన బుచ్చి నాయుడు కండ్రిగ మండలం లోని పెద్దపాలేడు గ్రామంలోని మిరప తోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలగురవయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం పెద్దపాలేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కనమనంబేడు తదితర గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న మిరప తోటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాల గురవయ్య మాట్లాడుతూ తుపాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని.. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాని కోరారు.

పిచ్చాటూరు తహశీల్దార్‌పై చర్యలు తీసుకోండి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో పనిచేస్తున్న తహశీల్దారు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ జగనన్న లబ్ధిదారులకు ఇంటి స్థలాల పంపిణీలో కీలపూడి గ్రామంలో ఒకే పేరుతో రెండు పట్టాలు మంజూరు చేసిన వైనాన్ని సిపిఎం మండల కార్యదర్శి రాంచంద్రారెడ్డి ప్రశ్నించారు. దీంతో తహశీల్దార్ మాట్లాడుతూ తన ఇష్టం వచ్చినన్ని పట్టాలిస్తాను దిక్కున్న చోటు చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీనిపైసిపిఎం సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్ పిచ్చాటూరు తహశీల్దార్‌తో సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో మాట్లాడగా 'అర్జీ కూడా తీసుకోకుండా ఒకే వ్యక్తికి ఎన్ని పట్టాలైనా ఇస్తాము.. మీరు ఎవరు నన్ను అడగడానికి మీరు వెళ్లి కలెక్టర్‌కి చెప్పుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై దాసరి జనార్ధన్ ఆగ్రహం వెలిబుచ్చారు. జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణం పిచ్చాటూరు తహశీల్దారుపై శాఖా పరమైన విచారణ జరిపించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇప్పించి అనర్హుల పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పైన రాజకీయ పార్టీల నాయకుల పైన దురుసుగా ప్రవర్తిస్తున్న తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, సత్యవేడు మండల కార్యదర్శి రమేష్, కెవిబిపురం మండల కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో నైపుణ్య అభివృద్ధి కళాశాల ఏర్పాటు

జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్మోహన్

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా శ్రీసిటీలో నైపుణ్య అభివృద్ధి కళాశాలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్మోహన్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల 2023లో శ్రీసిటీలో నైపుణ్య అభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాలను మెరుగు పరచి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలన్నదే దీని ఉద్దేశం అన్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్కిల్ కాలేజీను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌హబ్, తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి శ్రీసిటీలో ఒక స్కిల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. స్కిల్ హబ్,స్కిల్ కళాశాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని వృత్తిపరంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మరిన్ని వివరాలు కోసం నైపుణ అభివృద్ధి కో-ఆర్డినేటర్లు దినకర్ 8121585857, సునీల్ 91544 49677 గణేష్(పీఈ) 6303578886 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాలలో భారతదేశం

సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ప్రజాశక్తి- గూడూరు రూరల్: బీజేపీ పాలనలో భారతదేశం కార్పొరేట్ కబంధ హస్తాలలో చిక్కుకుందని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం గూడూరు పట్టణంలోని పాత బస్టాండు సెంటర్‌లో 98వ సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్అండ్ బీ కార్యాలయం, కోర్టు సెంటర్, గాంధీనగర్ ప్రాంతాలలో సీపీఐ జెండా ఆవిష్కరించారు. సీపీఐ, ఏఐటియూసి, ఏఐఎస్ఎఫ్ నాయకులు సీవీఆర్. కుమార్, కాలేషా, నారాయణ, చంద్రయ్య, రాజా, మన్సూర్, బాషా, బాలాజీ, హేమంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పేదలకు భూములు పంచిన చరిత్ర సిపిఐదే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జయ రామచంద్రయ్య పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 98వ వ్యవస్థాపక వేడుకలు పుత్తూరు నగరంలో ఎర్రజెండాను ఎగుర వేసి ఘనంగా నిర్వహించుకున్నారు. తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు జే.రామచంద్రయ్య అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఒక్కరూ మతోన్మాద శక్తుల నుండి ఈ దేశాన్ని విముక్తి చేయడానికి ప్రతిన భూనాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్, నాయకులు సెల్వరాజ్ఆచారి, కృష్ణారెడ్డి, రవి, బాబి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిఎన్‌కండ్రిగ: బిఎన్‌కండ్రిగలో సోమవారం సీపీఐ 98వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామని.. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రజలకు మేలు జరిగే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రమ్మ, కష్ణయ్య, పీటర్, మారయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిసిటీ: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 98వ వ్యవస్థాపక వేడుకలు తిరుపతి నగరంలో వాడ వాడల ఎర్రజెండాను వివిధ కాలనీలలో ప్రజాసంఘాల శాఖలలో ఎగుర వేసి ఘనంగా నిర్వహించుకున్నారు. తిరుపతి బైరాగి పట్టెడలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పి.మురళి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. 98వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ మతోన్మాద శక్తుల నుండి ఈ దేశాన్ని విముక్తి చేయడానికి ప్రతిన భూనాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నేడు ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో నేడు జేకేసీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంక్ రిలేషన్ షిప్ ఆఫీసర్స్ పోస్టులకు రాత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికలు జరుగుతాయని ఆయన చెప్పారు. డిగ్రీ కోర్సులు పూర్తి చేసినా, చివరి సంవత్సరం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ ప్రాంగణ ఎంపికలకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వారి బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు సెల్: 8374971327ను సంప్రదించాలని కోరారు.

29న వాహనాల వేలం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో సీజ్ చేయబడ్డ వాహనాలను ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ శ్రీనివాస రెడ్డి సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్టి రిజిస్ట్రేషన్ కలిగిన వ్యక్తులు నిర్దేశిత రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు. వివరాలకు సెబ్ స్టేషన్ ను సంప్రదించాలని కోరారు.

టిటిడికి రూ.70 లక్షల ఆస్తి విరాళం

ప్రజాశక్తి -తిరుమల: తమిళనాడుకు చెందిన ఓ భక్తురాలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం సుమారు రూ.70 లక్షల విలువైన ఆస్తిని టిటిడికి విరాళంగా అందించింది. తిరువళ్లూరు జిల్లా, పళ్లిపట్టు తాలూకా, కొడివలస గ్రామానికి చెందిన రిటైర్డ్ నర్సు ఎస్.కె.నెమావతి కొత్తగా నిర్మించిన రెండు అంతస్తుల భవనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ ఇంటి విలువ రూ.70 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని టిటిడి ఎస్టేట్ విభాగం ప్రత్యేకాధికారి మల్లికార్జునకు ఇంటి పత్రాలు, తాళాలను అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందువారి కుటుంబానికి మంజూరైన మంత్రి ఆర్.కె.రోజా నగరి మంత్రి కార్యాలయంలో నగరి మున్సిపాలిటీకి చెందిన మహిళ ఎంఎం కామాక్షి ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి కింద రూ.3.50 వేల రూపాయలు, నగరి రూరల్ మండలం చిన్న తాంగల్ చెందిన వాసుగి ధనపాల్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.3 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయించిన మంత్రి ఆర్.కె.రోజాకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుల పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు కూరపాటి రవీంద్రబాబు సోమవారం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుప్రియతో మాట్లాడారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. గోరుముద్ద కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని.. ఆడపిల్లలకు సరైన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓ ప్రయివేటు కళాశాలలో నర్సింగ్ చేస్తున్న పట్టణంలోని ఎంఎంవాడకు చెందిన విద్యార్థిని జాహ్నవికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సోమవారం రూ.లక్ష సాయం అందజేశారు. రేణిగుంటలోని జపన్య నర్సింగ్ కళాశాలలో చదువుతున్న జాహ్నవి ఆర్థిక స్తోమతను తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక వైసీపీ విద్యార్థినికి ఆర్థిక సాయం చేశారు. భవిష్యత్తులో ఇంకెలాంటి సాయం కావాలన్నా నేరుగా తనకు తెలియజేయాలని కోరారు.

బాలాసదన్‌కు టెలివిజన్ వితరణ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వ ర్యంలో స్థానిక నర శింగరావు పేట లోని బాలా సదన్‌కు దాత రొటే రియన్ ప్రత్యూష టీవీని సోమ వారం వితరణ చేశారు. ఆమె తండ్రి గోపాలకృష్ణ మూర్తి జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం టీవీని వితరణ చేసినట్లు తెలిపారు. రోటరీక్లబ్ మాజీ ప్రెసిడెంట్ ఎస్.వి.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు వినోదం కోసం టీవీని అందించడంతో దాతను అభినందించారు. మయూరి శ్యామ్‌యాదవ్, అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, కార్యదర్శి రవికుమార్, మునిగిరిష్, సీనియర్ రొటేరియన్లు దశరథరామరెడ్డి, నాగేంద్ర ప్రసాద్, పి.వి.కష్ణయ్య, జి.జి.నాయుడు, తాళంకి వెంకట సురేష్ బాబు, రాం ప్రసాద్, బాలసదన్ కేర్‌టేకర్, పిల్లలు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు మండలం కొండగుంట గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గేదెలకు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ పశువులు గాలికుంటు వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాయని.. పశువుల కొట్టాలు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచుకోవాన్నారు. ఫౌండేషన్ జిల్లా అభివద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిమ్మ రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్, వెటర్నరీ అసిస్టెంట్ కల్పన, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT PUTTUR
O.S.NO. 205/2021

Between:
S. Shajadhi ... Plaintiff
And:
S. Naseema Begam ... Defendant

NOTICES TO DEFENDANT

S. Naseema Begam W/o. S. Gafoor Saheb Muslim, aged about 70 years, Door No. 1-142, Bhavani Nagar, Dasari Street, (Old Hostel), Chandragiri Village and Mandal, Tirupati Dist, A.P.

Please take notice that, the above case was filed by the petitioner/plaintiff as against you for recovery of amount in the above court and the same is posted on 05.01.2023. Hence you are here by directed to attend before the above court at about 10.30 A.M. either in person or through Advocate. Otherwise the above case will be decided an exparty.

Hg. date : 05.01.2023

G. Raja Reddy, B.Com., LL.B.,
Advocate, Puttur.

వంగవీటి విగ్రహం ఏర్పాటు చేస్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కాపు నేత వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని శ్రీకాళహస్తి పట్టణంలో ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కాపులకు హామీ ఇచ్చారు. పట్టణంలోని స్థానిక పెళ్లి మండపం వద్ద కాపు నేత వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాపుల ఉద్యమ నేతకు విగ్రహం ఏర్పాటు చేసి తీరుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కాపు నేతలు అంజూరు శ్రీనివాసులు, పగడాల రాజు, పూల కృష్ణయ్య, ఉప్పు కృష్ణయ్య, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్, సూరాగారి రమేష్, ఉత్తరాజి శరవణ,కంఠా ఉదయ్, సెన్నిరు కుప్పం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి

గూడూరు రూరల్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, స్వర్గీయ వంగవీటి మోహన రంగా 34 వర్ధంతి సందర్భంగా రంగా రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. వంగవీటి మోహనరంగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆ మహనీయుని స్మరించుకొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రనీల్, వెంకటేశ్వర్లు, నారాయణ, చంద్రశేఖర్, మోహన్, సూర్య, నాగార్జున, సాయి, వంశీ, శివ, శంకర్, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ రెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : వెలుగు దినపత్రిక ఇన్‌చార్జి, సంఘ సేవకుడు కలవ గుంట భరత్ రెడ్డి సేవలు అభినందనీయమని శ్రీకాళ హస్తి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎ.కామేష్ కొనియాడారు. తొట్టంబేడు మండలం రాంబట్లపల్లెకు చెందిన కలవగుంట భరత్ రెడ్డిని ఇటీవల జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కలవగుంట భరత్ రెడ్డిని సోమవారం స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ భరత్‌రెడ్డి సేవలు గుర్తించి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం హర్షణీయమన్నారు. సీనియర్ పాత్రికేయులు వలిపి శ్రీరాములు, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, గౌరవాధ్యక్షుడు వీసీ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు వై.కోటేశ్వరబాబు, జయశ్యామ్, మెహర్, హరి, ధనశేఖర్, రఫీ, చంద్ర, హరీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల్లో సిలికాతవ్వకాలు ఆపండి

డీఆర్ఓకు రైతుల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చిల్లకూరు మండలం మోమిడి పంచాయతీలోని పునుగుంటపాలెం రైతులకు చెందిన భూములలో అక్రమంగా సిలికా మైనింగ్ తవ్వకాలను ఆపాలని ఆ గ్రామ రైతులతో కలిసి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డీఆర్ఓ శ్రీనివాసరావుకి విన్నవించారు. శ్రీనివాసరావు స్పందిస్తూ వెంటనే మైనింగ్ వారికి, తహశీల్దార్‌కి ఆదేశాలు ఇచ్చి రైతుల భూముల్లో వారి అనుమతి లేకుండా సిలికా మైనింగ్ తవ్వకాలను చేయనీయ్యమని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని వారి భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా సిలికా తవ్వకాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. వారి భూములను ఆన్లైన్లో నుంచి తొలగించి ప్రభుత్వ భూములుగా మార్చిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని తెలిపారు. పునుగుంటపాలెం గ్రామస్తులు, మహేష్ పాల్గొన్నారు.

వేదవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు..

న్యాయామృత నిధి పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీ రాధేశ్యామ్‌కు చెన్నైకు చెందిన సుందరి అండ్ శ్రీ కళ్యాణ రామన్ ట్రస్ట్ టీ నగర్ వారు న్యాయామృతనిధి అను బిరుదుతో సన్మానించారు. వీరు దేశంలోవివిధ శాస్త్రాలలో విద్వాంసులైన పండితులను ప్రతి సంవత్సరం సన్మానిస్తారు. అందులో భాగంగా న్యాయ శాస్త్రంలో విశేష కృషి చేసి వేద, వేదాంత శాస్త్రాలను అధ్యయనం చేసినటువంటి డాక్టర్ ఏవిరాధేశ్యం గారి పాండిత్యాన్ని గుర్తిస్తూ ఈ సంవత్సరం వీరిని న్యాయామృత నిధి అను బిరుదుతో సన్మానించి సత్కరించారు. విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్యరాణి సదాశివమూర్తి, డీన్లు ఫణి యజ్ఞేశ్వరయాజులు, తారకరామ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ విభాగా అధ్యక్షులు, వీఆర్వో డాక్టర్ టి. బ్రహ్మాచార్యులు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని బైరాగిపట్టెడ మహాత్మా గాంధీ నగర పాలక ఉన్నత పాఠశాల లో సోమ వారం ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ తూకి వాకం శాలిని మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 132 టాబ్లను ఎనిమిదవ తరగతి విద్యార్థులకు అందించారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక వైసీపీ నాయకులు తూకివాకం మహేష్ రెడ్డి, బండి మధుసూదన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు వి.మధు, సారథి, పుష్పలత, ముని శారద , ఖాదర్ ఉన్నిస్సా బేగం, అరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ: సాంకేతిక విద్యాబోధన అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈక్రమంలో సోమవారం స్థానిక కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మునెయ్య ట్యాబ్‌లను అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు, వీధులు

\- గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తన తండ్రి గాలి ముద్దు కృష్ణమ నాయుడు తెలుగు దేశం ప్రభుత్వం లో నిధులు మంజూరు చేయించిన గ్రామీణ రోడ్లను నిర్మించు కోలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వం వుండడం నగరి నియోజకవర్గ ప్రజల ఖర్మ అని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ విమర్శించారు. సోమవారం నింద్ర మండలం జి.ఎన్.కండ్రిగ పంచాయతీలో ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వై.ఎన్.కండ్రిగ, జి.ఎన్.కండ్రిగ గ్రామాలకు తెలుగుదేశం ప్రభుత్వం లో నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచినా రోడ్లను పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే నగరిలో వుందని పేర్కొన్నారు. గ్రామాలకు రోడ్లు లేవు, గ్రామాలలో పారిశుధ్యం అధ్వాన్నంగా వున్నా పట్టించు కునేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలుగుదేశంలో వేసిన రోడ్లు, వీధి దీపాలు తప్ప ..ఈ ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేసే దిక్కు లేదని, నిబంధనలు పెట్టి పేదవారికి పింఛన్లు తొలగిస్తున్న దుర్మార్గపు ప్రభుత్వం రాష్ట్రంలో ఉందన్నారు. దుర్మార్గపు వైసీపీ పాలనకు చరమగీతం పాడి, ప్రజల పార్టీ తెలుగుదేశంను గెలిపించాలని కోరారు.. టిడిపి నాయకులు, వాసు, బాలా, కార్యకర్తలు పాల్గొన్నారు.